


ఉత్తమ రచన!

ఉత్తమ రచన అనగా నేమి? ఇది ప్రశ్న. జవాబు అనేక రకాలుగా వుంటుంది. ఆ రకాలన్నీ వదిలేసి-అశేష పాఠకులచేత చదివింపచేసి, ఆ చదివిన దానిని గుర్తు పెట్టుకునేలా చేయగల రచనే ఉత్తమ రచన అని టూకీగా అనుకుందాం. ఈ క్వాలిటీ ఎన్ని కథలూ, నవలల్లో కనిపిస్తుందో నేను సర్వే చేయలేదు. నాకంటికి మాత్రం 'వార ఫలాలను' మించిన ఉత్తమ రచన మరొకటి కనిపించలేదు.

చదువు వచ్చిన జనాభాలో ఎక్కువమంది 'వార ఫలాలు' తప్పకుండా చదువుతారు. చదివి గుర్తు పెట్టుకుంటారు. ఉత్తమ రచనకైనా ఇదే గదా పరమార్థం. అందుచేత వార ఫలాలను ఉత్తమ రచనలుగా నేను ఎల్లప్పుడూ

ఎంచుకుంటాను. ఆ రచనల మీద నాకు గురి, గౌరవం కూడా అపారంగానే వున్నాయి.

ఫీచరు రైటర్లని ప్రత్యేకించి కొందరు రచయితలుంటారు. వాళ్ళ పూర్వచరేమిటో నన్నడగొద్దు. ఒక శీర్షిక పేరిట వాళ్ళు కొన్ని రచనలు చేస్తుంటారు. వారం వారం రాసేవారు కొందరుంటే వారానికి రెండు తడవలు రాసేవారు ఇంకొందరుంటారు. కొందరు పక్షానికో, నెలకో ఒక తడవ రాస్తుంటారు. వారఫలాలు కూడా ఒక విధంగా ఫీచరే. అయితే ఈ ఫీచర్‌కి, ఆ ఫీచర్లకీ కొంచెం తేడా వుంది. మామూలు ఫీచర్లు రాసే వాళ్ళకి యిబ్బంది లెక్కువ. పూర్వం రాసింది మళ్ళా రాయకూడదు. ఎప్పుడు రాసినా నిత్య నూతనంగా వుండాలి. చదివిన మనిషి మూర్ఛపోవాలి. ఒకరు రాసిన విషయం మరొకరు రాస్తే రాణించదు. అంచేత విషయ సేకరణ విషమ సమస్య అవుతుంది. విషయం దొరికినా అందులో వెరైటీ వుండాలి. అప్పుడుగాని ఫీచరు పేలదు.

వారఫలా లనబడే ఈ ఫీచరు ఇన్ని కష్టాలకు గురికాదు. ఆ రచయిత ఏమి రాసినా చెల్లుబడి అవుతుంది. పరమ వేదమవుతుంది. జనం విరగబడి చదువుతారు. మేషమనీ, తుల, కర్కాటకమనీ కొన్ని రాశులుంటాయి. ఆ రాశులకింద ఒక్కో రాశికి ఒక్కో పేరా కేటాయిస్తారు. ఆ పేరాలో ఆ వారం జరగబోయే గొడవలు రాస్తారు. అవన్నీ తు. చ. తప్పకుండా ఆ రాశి వారందరికి జరగాలనే రూలు లేదు. జరిగితే జరుగుతాయి, జరక్కపోతే పోతాయి. జరిగిన వాళ్ళు ఆహా! అనుకుంటారు. జరగని వాళ్ళు పోన్లే పాపమని వచ్చేవారం ఫలితాలకోసం ఎదురు చూస్తారు. రాసినదాంతో తమ కేమీ సంబంధముండటం లేదని తెలిసినా కూడా చదువుతారు. మళ్ళా మళ్ళా చదువుతారు. అదొక మత్తు మందు. అంచేత వారఫలాల ఫీచరు ఛస్తే ఫెయిల్ కాదు.

వారఫలాల రచయితలు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటారు. పరీక్ష సీజన్లో అన్ని రాశుల్లోనూ పరీక్ష గొడవలే ఉటంకిస్తారు. పెళ్ళిళ్ళ సీజనొస్తే

ఆ బాపతు విషయాలే అన్ని రాశుల్లోనూ సర్దుతారు. పండగ లొస్తున్నాయని తెలీగానే దానికి తగ్గట్టు ఫలితాలు చెబుతారు. ఈపాటి జాగ్రత్తలు కొన్ని పాటిస్తే చాలు—వార ఫలాలు బ్రహ్మాండంగా చెక్కుకు పోవచ్చు. మేషరాశి వారికి క్రితంసారి రాసిన ఫలితాలు అక్షరం మార్పు లేకుండా ఈ వారం తుల రాశి వారికి రాసుకోవచ్చు. తుల వారికి రాసింది కర్కాటకం వారికి తగిలించవచ్చు. ఒకేసారి అన్నిటికి రాసుకుని వాటినే తిప్పి తిప్పి మార్చు కుంటూ, మధ్య మధ్య స్పెషల్స్‌ని యిరికిస్తూ పోతే వారఫలాల రచయితకు తిరుగుండదింక. చదివే పాఠకులు ఎవరి గొడవలు వారు చూసుకుంటారే తప్ప— వారికి రాసింది వీరికి రాస్తున్నా వేమిటని ఎవరూ అడగరు. ఫీచరు రైటర్లాగా వచ్చేవారం ఏమి రాయాలి భగవంతుడానే దిగులు వారఫలాల ఫీచరు రైటర్ల కుండదు. కథా రచయితలకుమల్లే కొత్త వస్తువుకోసం తాప త్రయ పడనవసరం లేదు.

ఆరోగ్యం బావుంటుంది. ప్రయాణాలు తలపెడతారు. ఉద్యోగంలో అనుకూలమైన మార్పు లొస్తాయి. పుణ్యకార్యాలు నిర్వహిస్తారు. గడచిన దానికంటే గడవబోయే పిరీడు అద్భుతంగా వుంటుందంటూ పొడి మాటలు గిలుక్కుంటూపోతే అక్కడికి ఆ రచయిత డ్యూటీ పూర్తవుతుంది. ఇందుకు శైలి, శిల్పం అక్కర్లేదు. పేజీలు పెంచవలసిన అవసరం అంతకంటే లేదు. ఎన్ని ముచ్చట్లయినా చెప్పుకోవచ్చు. ఈ వారానికి పంపిన వారఫలాలు అని వార్య కారణాలవల్ల అచ్చు కాకపోతే వాటిని ఆ తర్వాత వారానికి ఉపయో గించుకోవచ్చు. పేచీరాదు. వారఫలాల రచయిత బద్ధకించి ఆ వారం ఫలితాలు పంపకపోతే రెండు నెలల క్రితం ఫలితాలు మళ్ళా ఆ వారానికి అందించ వచ్చు. ఎవరూ ఆక్షేపించరు. అంచేత వారఫలాల రచయితకుగానీ ఆ ఫీచ రుకు గానీ ఎల్లాంటి ఇబ్బందీ రాదని నేను సవినయంగా మనవి చేసుకుంటు న్నాను.

నాకు తెలిసిన సంపాదకుడొకాయన ఈ మధ్య వాళ్ళ వారఫలాల రచయితతో తగువు పెట్టుకున్నాడట. సదరు సంపాదకుడిది తులారాశి. ఆ రాశి వారికి అప్పు లెక్కువ, అశాంతి ఎక్కువ, అల్లరెక్కువని ఏదేదో రాసిపంపేడుట ఆ రచయిత. దాంతో ఈయన గారికి చిర్రెత్తుకొచ్చింది. వెంటనే ఆ రచయితకి ఉత్తరం రాసేడు. అయ్యా, వారఫలాల పవరేమిటో నాకు బాగా తెలుసు. నాది తులారాశి. జ్ఞాపకముంచుకోండి. ఈ రాశి వారికి బాధలూ, కష్టాలూ రాయకండి. ఎప్పుడు ఏమి రాసినా ఆశాజనకమైన విషయాలే రాయండి. జనానికి ఆశ కలిగించడం మీ ప్రథమ కర్తవ్యం. నిరుత్సాహపరిచే విధంగా అక్షరం రాసినా సహించను. మీకు కష్టంగా వుంటే చెప్పండి, వార ఫలాలు మేమే రాసుకుంటాం. ఇట్లు—సంపాదకుడు.

ఇవతల నేనెట్లాగూ ఫీచరు రంగంలో కాలు పెట్టేను. ఒకవేళ వాళ్ళ వారఫలాల రచయితతో యిబ్బందిగా వుంటే నాకు ఖబురు చేయమని సంపాదకుల వారితో అన్నాను. వారఫలాలు రాయడానికి నాకేటువంటి అభ్యంతరం లేదన్నాను. పైగా-ఈ ఫీచరు కోసం కష్టపడనక్కరలేదు గనుక మునుపటి రచయితకిచ్చే దానిలో సగం ప్రతిఫల మిచ్చినా చాలన్నాను. వార ఫలాల పాఠకులకు టన్నులకొద్దీ ఆశను సరఫరా చేస్తానని హామీ ఇచ్చేను. ఆయన జాబుకోసం ఎదురు చూస్తున్నాను. నా హామీ ఆయన్ని తృప్తిపరిస్తే ఇకముందు నేను ఉత్తమ రచనలే చేస్తాను.